

# జీవితసంధ్య

గురజాడ. శోభాపేరిందేవి

'వృద్ధాప్యాన్ని మించినశాపం మరొకటి లేదేమో!' అనుకుంటుంది కాంతమ్మ 'వృద్ధులంటే అందరికీ చిన్నచూపే! వారి సలహాలు వినాలన్నా వారితో మాట్లాడాలన్నా చిరాకే! నిజంగా వృద్ధాప్యమే కనక శాపమే ఐతే ఆ శాపానికి గురి కాని మానవుడు ఉండడు కదా! మరి ఆ మాటని కుర్రకారు గుర్తించరేం?'

ప్రస్తుతం దేశంలో అరవై ఏళ్ళు దాటినవాళ్ళు నాలుగుకోట్లమంది, డబ్బై ఏళ్ళు దాటినవాళ్ళు నలభై లక్షలమంది ఉన్నారని ఆవిడ దినపత్రికలో చదివింది. (దినపత్రిక రోజూ తూచా తప్పకుండా పూర్తిగా చదివే వ్యక్తి వాళ్ళింటి మొత్తంలో ఆవిడే!) మరి వాళ్ళంతా కూడా తనలాగే జీవచ్ఛవాలుగా ఉంటున్నారా?'

"బామ్మా! బామ్మా!" పిలుస్తూ వచ్చింది మానస.

"ఏమిటే?" అడిగింది కాంతమ్మ.

"నీకు చెముడు కానీ వచ్చిందా బామ్మా ఎన్నిసార్లు పిలిచినా పలకవు! ముసలి వాళ్ళకి చెముడు తప్పకుండా ఉంటుందిట కదా!"

"ఇంతకీ విషయం ఏమిటమ్మా?"

"నా ఫ్రెండ్ రతీ లేదూ వాళ్ళబామ్మ 'పెళ్ళీడు పిల్లలు' సినిమాకి వెళ్ళిందిట. నువ్వే చెప్పుబామ్మా అవిడ చూడవలసిన సినిమా అదా? ఏ 'స్వామి అయ్యప్ప'కో పోవాలికదా! మేమంతా నవ్వలేక చచ్చామనుకో!"

"మానసా!" పిలిచింది వంట గదిలోంచి ఆ అమ్మాయి తల్లి.

"వస్తున్నానమ్మా" అంటూ పరిగెత్తింది మానస.

కాంతమ్మ పెద్దగా చదువుకోలేదు. అయితే ఏం? అనుభవాలు చెప్పినపాఠాలు ఆవిడని విద్యాధికురాలిని చేసాయి. తెలుగు దినపత్రిక చదవడం వల్ల ప్రపంచంలో ఏ మూల ఏం జరుగుతుందో ఆవిడకి బాగా తెలుసు. కానీ అందరూ ఆవిడకి ఏమీ తెలియదనుకుంటారు.

ఇంట్లో అందరూ రాజకీయాలను గురించి మాట్లాడుకుంటున్నప్పుడు తను కూడా ఉత్సాహంగా పాల్గొంటుందావిడ. కానీ ఆవిడ ఏ విషయం గురించి మాట్లాడినా కారణం లేకుండానే నవ్వేస్తారు మనవలు. అప్పుడు ఆవిడ మనసు చివుక్కుమంటుంది. వెక్కిరింతగా మాట్లాడినా, వెకిలిగా నవ్వినా కొడుకూ కోడలూ మందలించక పోవడం ఆవిడకి మరీ బాధని కలిగిస్తుంది.

ఆవిడకి చేతకానిది లేదు. కుట్లూ, అల్లికలూ, వంటా వార్పులలో ఆవిడది అందవేసిన చెయ్యి. మానస బట్టలమీద ఎన్నో ఎంబ్రాయిడరీలు చేసింది. కుర్చీ కవర్లు వగైరాలన్నీ ఆవిడ చేతిమీదుగానే కుట్టబడే ఎంబ్రాయిడరీ చేయబడ్డాయి. పిల్లల పుస్తకాలకి అట్టలువేసి లేబుల్స్ అంటించడంకూడా ఆవిడే చేస్తుంది.

కాంతమ్మని కోడలు ధాత్రి కష్టాలు పెట్టేస్తోందని కాదు. కానీ అందరితోనూ సరదాగా కలిసి మెలిసి తిరగాలని, వారి ఉత్సాహంలో పాలు పంచుకుని, తన అనుభవాల సంపదను వారికి అందివ్వాలన్న ఆవిడ కోరిక మాత్రం ఇప్పటిదాకా తీరలేదు.

పిల్లలు కాలేజీలనుండి రాగానే వాళ్ళు తన ఎదుట కూర్చుని కబుర్లు చెప్పుకుంటే బాగుండును అనుకుంటుంది. కానీ వాళ్ళకి ఆవిడ ఎదురుగా కూర్చుని మాట్లాడడం బోర్!

కొడుకు దినకర్ ఆఫీసునుండి రాగానే తల్లి వైపైనా చూడకుండా తిన్నగా వంట గదిలోకిపోయి ఆఫీసు కబుర్లన్నీ ధాత్రికి చెబుతాడు. 'పోనీ తానే వెళ్ళి కూర్చుంటే ఏమవుతుంది?' అని అలా చాలాసార్లు చేసింది. కానీ అదేం ఖర్మమో తను రాగానే దినకర్ మాట్లాడడం ఆపేస్తాడు. ధాత్రి నొసలు చిట్లించుతుంది.

ఓ రోజు రాత్రి ధాత్రీ దినకర్‌ల మాటలువిన్న కాంతమ్మ ఆపైన వాళ్ళ మధ్యకి వెళ్ళలేదు.

"మన ఇద్దరినీ సరదాగా ఓ పావుగంటైనా

మాట్లాడుకోనీయకుండా వచ్చి కూర్చుంటారేమిటండీ అత్తయ్యా ?'' అని అడిగింది ధాత్రి.

''నీకు తెలియనిది ఏముంది ధాత్రీ ! అమ్మని బామ్మ చాలా కష్టాలు పెట్టిందిట. అమ్మా నాన్న ఆవిడ నోటికి దడిసి పగటిపూట ఒకరిని ఒకరు తప్పుకుని తిరిగేవారుట. ఇప్పుడు ఆవిడ మనలని అలా విడదీయనూలేదు. కలిసి ఉంటే తనతో పోల్చుకుని కుమిలిపోకుండా ఉండలేదు. అందుకే ఇలా వచ్చి మన ఏకాంతానికి అంతరాయం కలిగిస్తుంది.''

ఆ మాట విన్న రాత్రి కాంతమ్మకి నిద్ర రాలేదు. 'సుఖం' అన్న పదానికి అర్థమే తనకు తెలియకపోవచ్చు. అలాగని తన స్వంత కొడుకూ కోడలూ సుఖపడడం సహించలేక అడ్డుపడే అంత చెడ్డదా తాను ?' అనుకుంది పదే పదే ధోవతితో కళ్ళు తుడుచుకుంటూ !

ఆ మాట గుర్తు రాగానే ఆవిడ కళ్ళు నీటితో నిండాయి.

ఒక్కోరోజు వంటంతా కాంతమ్మే చేస్తుంది. లొట్టలు వేసుకుంటూ తింటారు అందరూ ! ఆ సమయంలో వాళ్ళకి ఆవిడని ఏడిపించబుద్ధి కాదు. తర్వాత మళ్ళీ మామూలే !

పదిహేను రోజులకి ఓసారి మంగలి వస్తాడు. అతడితో సందులోకి నడిచి గుండు గీయించుకుంటుంది కాంతమ్మ. అది చూసి విరగబడి నవ్వుతుంది మానస.

ఓ రోజు నవ్వుతూనే ''అదేమిటి బామ్మా ? నువ్వు ఎవరి ఎదుటా ముఖ్యంగా మగవారి ఎదుట గుండుమీది ముసుగే తీయవు కదా ! ఇప్పుడు ముసుగు తీసేయడమే కాక పరాయి మగాడిచేత గుండు గీయించుకుంటున్నావు '' అంది మానస. ఆ మాట నిజమే అనిపించింది కాంతమ్మకి ! విధవ అయిన స్త్రీ అలంకారప్రాయమైన జుట్టూ, పూలు, గాజులూ ఉంచుకో కూడదు అని నియమం పెట్టిన వ్యక్తులు ఇలాంటి చిన్న చిన్న విషయాలలో నిర్లక్ష్యం వహించారెందుకో ! అనుకుంది.

ఓ రోజు పరీక్షకి బయలుదేరుతున్నాడు మనవడు మానుష్. (రోజూ అతను పరీక్షకి వెళ్ళే సమయానికి లోపల ఎక్కడో [illegible]వాలని కూర్చునేది కాంతమ్మ.) తన వస్తువులన్నీ సర్దుకుంటున్నవాడు తల్లితో ''అమ్మా నా పెన్ను కనిపించడంలేదు'' అనేసి వెతుక్కోసాగాడు. వంట గదిలో ఉన్న ధాత్రి పట్టించుకోలేదు.

తానే వెతికి ఇద్దాము అనుకుని ముందు గదిలోకి వచ్చిందావిడ. అప్పటికే అది దొరకడంతో అతను గబగబా ముందుకు నడిచాడు.

ఆవిడ గబగబా వెళ్ళి అతన్ని ఆపి ''ఒరేయ్ నా శకునం మంచిది కాదురా! మీ అమ్మని ఎదురు రమ్మంటాను. అప్పుడు వెడుదువుగాని !'' అంది.

''పో బామ్మా ! నాకు ఇలాంటి వాటిమీద నమ్మకం లేదు. అసలే లేటైపోతుంటే నీ గోలేమిటి ?'' అంటూనే వెళ్ళిపోయాడు.

మానుష్ వచ్చేదాకా ఆ విషయమే ఆలోచిస్తూ అతను పరీక్ష బాగా రాయాలని పదే పదే దేముడికి దండం పెట్టుకుంటూ ఉండిపోయింది కాంతమ్మ.

ఆ రోజు రోజులాగ కాక ఆఖరి పరీక్ష కావడంతో ఆలస్యంగా ఇంటికి వచ్చాడు మానుష్.

''బామ్మా నీ శకునంవల్ల నేను అద్భుతంగా రాసాను తెలుసా ? అయినా గుండూ, ధోవతిలతో తిరుగుతావు కనక 'శకునం శకునం' అని అంటారు కానీ ఎందరో వితంతువులు పూలూ, గాజులతో బొట్టూ కాటుకతో కనబడితే శకునం అంటున్నారా? కనక తప్పు నీదీ నీలాంటివాళ్ళదీ కాదు అని నేనంటాను'' అన్నాడు మానుష్.

మనవడి మాటలో అక్షరం కూడా తప్పు కనబడలేదామెకి ! అతని మాటలు ఆమెని సంతోష పెట్టేసాయి. తమ కాలంలో మగవాళ్ళు కూడా ఈ విధంగా ఆలోచించి ఉంటే తము ఇంకో రకంగా ఉండేవారేమో ! అనుకుంది. పోనీలే ఇప్పటికైనా ఆలోచనాధోరణిలో మార్పు వచ్చింది అనికూడా అనుకుంది.

''బామ్మా గుడికి వెడదాం వస్తావా ?'' మానస అడిగింది.

ఆలోచనలలో చిక్కుకుపోయిన కాంతమ్మ ఉలిక్కిపడింది.

''విశేషం ఏమిటే ?'' అని అడిగింది ఊహిస్తూనే !

''సోమవారం నుండి పరీక్షలు'' అంది భయంగా!

కాంతమ్మకి నవ్వొచ్చింది. దాన్ని పెదవి దాటనీయకుండా చేసి ''త్వరగా రా అయితే'' అంది.

''వన్ మినిట్'' అని పరిగెత్తిన మానస అరగంటకి తిరిగివచ్చింది.

చంద్రకాంతం రంగు కంచిపట్టు పరికిణీ ఓణీలో చంద్రకాంత పువ్వులాగే ఉండి ''త్వరగా పద బామ్మా'' అని తొందరపెట్టింది.

ఈసారి ఆవిడ నవ్వకుండా ఉండలేకపోయింది.

'ఏం ఆడపిల్లలో ! అన్ని రంగాలలోనూ త్వరపడి పైకి వచ్చేస్తున్నారు. కానీ ముస్తాబు విషయంలో మాత్రం 'తొందర' అన్న పదానికి అర్థమే విస్మరిస్తున్నారు !' అనుకుంది.

శనివారం కావడంతో ఆంజనేయస్వామి గుడి కాస్త రద్దీగానే ఉంది.

చేతులు జోడించి, కళ్ళు మూసుకుని నిలబడి పోయింది కాంతమ్మ. 'స్వామీ త్వరగా నన్ను జీవన్ముక్తురాలిని చెయ్యి' అని ప్రార్థించి కళ్ళు తెరిచింది.

మానస ఇంకా కళ్ళు తెరవలేదు.

తల ఇటు తిప్పిన కాంతమ్మ ఉలిక్కిపడింది.

కాంతమ్మ ఈడే ఉన్న ఓ మగాయన ఒళ్ళంతా కళ్ళు చేసుకుని మానసని చూసేస్తున్నాడు. కాదు కాదు చూపులతో జుర్రేస్తున్నాడు.

## జీవితం

జీవితపు ప్రమిదలో తైలం
కాలంతో హరించక మానదు.
జీవితపు వెలుగు కొడి కట్టకా తప్పదు
క్షణికమైన జీవితంలో
అనుక్షణం ఆశల ఆరాటంలో అలసే
మానవు డెంత పిచ్చివాడు !

— కె. సదాశివరావు

కాంతమ్మకి కోపం ముంచుకువచ్చింది 'ఆ వయసు వ్యక్తి చేయవలసిన పనేనా అది ?' అదే వయసులో ఉన్న తానెలా ఉంది ! ఆవిడకి ఓ శ్లోకం గుర్తువచ్చింది.

'అంగం గళితం ఫలితం ముండమ్
దశన విహీనం జాతం తుండమ్
వృద్ధోయతి గృహీత్వా దండమ్
తదపిన ముంచత్యా శాపిండం !'

('చొప్పకట్టలా శరీరం ముడతలుపడిపోయినా, తల ముగ్గుబుట్టలా నెరిసిపోయినా, పళ్ళూడిపోయి బోసిగా అయిపోయినా, శక్తిలేక శరీరం క్షీణించి కర్రసాయంతో అడుగులు వేస్తున్నా కొందరికి ఆశ చావదు.')

ఆరోజు రాత్రి అద్దం ముందర కూర్చున్న కాంతమ్మకి తన శరీరంమీద పొడసూపుతున్న మచ్చలను చూసి కళ్ళనీళ్ళు తిరిగాయి. గత కొద్ది రోజులుగా ఆవిడ వాటిని చూస్తూనే ఉంది. కుష్ఠురోగం వచ్చిందేమో అని గిల్లుకుని చూసుకుంది. స్పర్శజ్ఞానం ఉంది. అయితే బొల్లేమో ! మందులు వాడితే పోతుందేమో ! ఆవిడకి చిన్నప్పటి నుండీ మచ్చలూ వగైరాలంటే ఓ విధమైన అసహ్యం. ఏ చిన్న పొక్కులాంటిది వచ్చినా అది పోయేదాకా ఆవిడకి స్థిమితం చిక్కదు.

ఎవరికి చెప్పాలి ? కొడుకుకి చెప్పాలంటే మొహమాటం ! కోడలిని పిలిచి రహస్యంగా చెప్పింది.

''కొన్ని మందులకి రియాక్షన్ వస్తుంది అత్తయ్యగారూ ! అలాంటప్పుడే ఇలాంటివి వస్తూ ఉంటాయి. అంతేతప్ప మరేమీ కాదు. అయినా మీ తృప్తికోసం డాక్టరు దగ్గరికి వెళ్ళవచ్చు అనుకోండి!

కానీ మీరే ఆలోచించండి ! ఆయన తెచ్చిన జీతంరాళ్ళే బొటాబొటిగా సరిపోతున్నాయ్. [illegible] ఎదుగుతోంది కదా అయినా దానిపేరిట చిల్లిగవ్వ దాచలేదు. మానుష్ ఏ ఇంజనీరింగ్‌కో వెడితే ఇంక చెప్పనే అక్కర్లేదు. అటు వాళ్ళ భవిష్యత్తూ పాడు చెయ్యలేము ఇటు ఆ ఖర్చులూ భరించలేము.

ఈ పరిస్థితిలో మనం ఎంత పొదుపుగా ఉంటే అంత మంచిది. మీరు కోపం తెచ్చుకున్నా నేను చెప్పకలిగినది ఇంతే !''

కాంతమ్మకి కోడలి మాటలు విన్నాక సిగ్గేసింది. నిజమే! ఖర్చులు బాగా పెరిగాయి. ఆదాయం మాత్రం అలాగే ఉంది. ఈ పరిస్థితిలో తాను ఇలాంటివి చెప్పడం ఏమిటి ?

తన పరిస్థితిలో ఏ మగవాడు ఉన్నా హాయిగా బ్రతుకుతాడు. తనవారిని బ్రతికిస్తాడు ! దానికి కారణం రిటైర్ అయినా ఏదో ఓ ఉద్యోగం చేయడమో, లేక పెన్షన్ డబ్బుని వాడుకోవడమో !

ఆ రాత్రి, మర్నాడు ప్రొద్దున్నా చాలా ఆలోచించింది కాంతమ్మ 'తానూ సంపాదిస్తే ఏమైంది ?' అని !

మధ్యాహ్నానికి ఆమెకి మంచి ఆలోచన వచ్చింది. మానసతో కలసి ఓ ఎంబ్రాయిడరీ షాపుకి వెళ్ళిందో సారి ! అక్కడికి ఎందరో ఆడవాళ్ళు వచ్చి కుట్లూ అవీ కుట్టి డబ్బు తీసుకుని పోతారుట.

'తానూ అలా చేస్తే ?'

''పురాణానికి వెడుతున్నాను'' అని కోడలికి చెప్పి బయటపడింది.

ఆ షాపు వాళ్ళ ఇంటికి చాలా దూరం ! బస్సులోనో రిక్షాలోనో వెళ్ళాలి. కానీ ఆవిడ దగ్గర డబ్బేమీ లేకపోవడంతో నడిచే వెళ్ళింది.

చెమటలు క్రక్కుకుంటూ, ఆయాసపడుతూ షాపులోకి వస్తున్న ఆ బోడి ఆవిడని ఆశ్చర్యంగా చూసారు షాపు యజమాని.

''మంచినీళ్ళు'' అంది.

ఇచ్చాడు.

గడగడా త్రాగేసి గ్లాసు అతనికి ఇచ్చేసింది.

''చెప్పండి.''

''నాకు ఎంబ్రాయిడరీ పని కావాలి బాబూ !''

చిత్తరపోయాడతను. ''మీరు అలాంటి పని ఏం చేస్తారమ్మా ''

''అవసరంలో ఉన్నాను నాయనా ! నా కొడుకుకి వేన్నీళ్ళకి చన్నీళ్ళుగా తోడ్పడాలన్నదే నా ఉద్దేశ్యం !''

''మీరు చేయలేరమ్మా !''

''చేయగలను బాబూ ! చూపు బాగానే ఉంది. చేతిలో చురుకుదనం ఉంది.''

అతనికి ఇంతదాకా ఇలాంటి సంఘటన ఎదురు కాకపోవడంతో ఆశ్చర్యంగా ఉంది. ఆవిడ స్థితికి జాలిగా కూడా ఉంది.

''మీ ఇల్లు ఎక్కడ ?''

చెప్పింది.

''ఎలా వచ్చారు ?''

చెప్పింది.

''మీకు వచ్చే డబ్బంతా రాకపోకలకే ఖర్చవుతుంది తల్లీ ! (రోజూ నడిచి రాలేరుగా) అయినా చేస్తాను అంటే మీ ఇష్టం ! కానీ మీ అబ్బాయికి ఈ విషయం తెలిస్తే ఒప్పుకోరు. ఎండపొడ ఎరగక ఇంటి పట్టున ఉండే మీకిది కష్టమే ! దీని వల్ల ఏ అనారోగ్యమో పట్టుకుంటే మీ అబ్బాయికి ఇంకో ఖర్చు కదమ్మా! ఆలోచించండి. మీరు రేపు వస్తే మీ ఇష్టం. కానీ రాకపోతేనే నాకు సంతోషం ! రోజూ నడిచి రావడం పోవడం తేలిక కాదు.'' (ఎంబ్రాయిడరీ మిషతో ఆడపిల్లలమీద వ్యాపారం చేస్తున్నానని మాత్రం చెప్పలేదు అతను.)

జవాబియ్యకుండా వెనుదిరిగింది కాంతమ్మ.

ఇల్లు చేరిన ఆవిడకి ఒళ్ళు పులిసిపోయింది నడకవల్ల ! మనసూ పాడైంది ఆలోచనలవల్ల !

# జీవిత సంధ్య

నిస్సత్తువగా వరండామీద కూలబడింది కాంతమ్మ.

ఆవిడకి తన స్థితిని చూసి జాలీ అసహ్యమూ కలిగాయి. తనవారికి సాయపడలేనందుకు జాలీ, ఇలాంటి స్థితిలోకూడా వారిమీద ఆధారపడడానికి అసహ్యమూ వేసాయి. కోడలికి సాయం చేయలేకపోతే కోపం, చేస్తే అసంతృప్తి !

తాను ఉన్నా లేకున్నా ఒకటే ! తన అవసరం ఎవరికీ లేదు. తనతో మాట్లాడాలన్న ఆసక్తి అంతకంటే లేదు. ఎంత వద్దన్నా వారి మాటల్లో ఏదో వెక్కిరింత కనబడుతూనే ఉంటుంది. ఏదో ఒకదానికి విసుక్కుంటూనే ఉంటారు. పిల్లలకి ఏ అనారోగ్యమో వస్తే విలవిల్లాడిపోతారు కానీ తనకి వస్తే పెద్దతనంగా తీసిపారేస్తారు. తను మనసారా నవ్వి ఎన్నాళ్ళయిందో ! మనసుకి నచ్చిన వంటకాలు తిని ఎన్నేళ్ళయిందో ! పెద్దవాళ్ళు పసివాళ్ళతో సమానం అంటారుకదా !

మరి తనని ఏ విషయంలో ఆ విధంగా చూస్తున్నారు ? మూగ మొద్దులాగ మూలగదిలో పడి ఉండిపోయింది తాను. ఎటూ వెళ్ళదు. ఏమీ చేయదు. పైసా అవసరం అయినా కొడుకే గతి ! ఎంత అవమానం ! ఎంత అమానుషం ! 'డబ్బు ఉంటే తననిలాగ చూసేవారా ? ఊహూ !'

ఇంతలో ...

ఓ గజ్జికుక్క కుంటుకుంటూ కుయ్యోమంటూ లోపలికి వచ్చి కాంతమ్మ కాళ్ళదగ్గర కూర్చుంది. దాని ఒంటినిండా గజ్జే ! ఎవరో రాయివేసి గాయపరచినట్లున్నారు. అందుకే కుంటుతూ వచ్చింది. గజ్జికూడా రేగినట్లుంది. రక్తం వస్తోంది.

ఈ కుక్కనే చాలా చిన్నపిల్లగా ఉన్నప్పుడు తెచ్చాడు అబ్బాయి. ''నా స్నేహితుడి కుక్కకి పుట్టింది. ముద్దుగా ఉందికనక తెచ్చాను'' అన్నాడు.

'తన మడికి ఆటంకం అవుతుందేమో' అని తాను తెగ భయపడింది. కానీ పాపం మూగ్ కనిపెట్టి దగ్గరికి వచ్చేది. మానవ, మానుష్‌లకైతే అది ప్రాణం అయిపోయింది. ఇద్దరూ పోటీలు పడి దానికి తిండి పెట్టేవారు. దానితో బాగా ఆడేవారు. అది పుస్తకాలు, చెప్పులు లాంటి తెచ్చివ్వడం కూడా చేసేది.

తర్వాత అది ముసలిదైపోయింది. మునపటిలాగ గెంతక మగతగా పడుకుంటోంది కనక పిల్లలు దాన్ని పట్టించుకోవడం మానేసారు.

'ఇది చస్తుందేమో ఇక్కడే' అన్న అనుమానం కలిగి దాన్ని తరిమేసారు. అది వచ్చినా రానివ్వరు. తాను జాలేసి అన్నంముద్ద పడేయబోయినా తిట్టిపోస్తారు.

బయట కుక్కలతో తిరగడంవల్ల దానికి గజ్జి అంటి ఇంకా అధ్వాన్నంగా తయారైంది.

ఇప్పటికీ తనని పెంచిన వారింటిమీద మమకారం ఉన్నట్లుంది. అందుకే తనకే గాయం తగిలినా, ఒంటికే బాధ కలిగినా 'కుయ్యో' అంటూ వస్తుంది తల్లికి చెప్పుకోడానికి వచ్చే చిన్నపిల్లలాగ ! ఇప్పుడూ అలాగే వచ్చినట్లుంది.

కుక్క అరుపు వినిపించికాబోలు తలుపు తీసాడు దినకర్. ''ఛీఛీ మళ్ళీ వచ్చింది పాడుకుక్క'' అంటూ రాయితో ఓ దెబ్బ వేసాడు. ఇందాకటి దానిమీదే మళ్ళీ తగిలిందేమో కుక్క గట్టిగా ఏడుస్తూ కుంటుతూ బయటకి వెళ్ళిపోయింది.

''నువ్వెప్పుడు వచ్చావమ్మా... ?'' అంటూ ఏదో అడుగుతున్నాడు దినకర్.

ఆవిడకి వినిపించలేదు. ఆవిడ చెవులకి కుక్క ఏడుపే వినిపిస్తోంది. ఆవిడ కళ్ళకి అది కుంటుకుంటూ వెళ్ళడమే కనబడుతోంది.

ముసలివైపోయిన జంతువులని తరిమికొట్టినట్లుగా కాక ముసలివారైపోయిన మానవులని కొద్దోగొప్పో ఆదరిస్తున్నారు. నోటికి హితవైనదే పెట్టకపోయినా కడుపు నిండేలాగ పెడుతున్నారు. కోరికలు తీర్చకపోయినా కొట్టడంలేదు.

పశువులను కటికవాళ్ళపాలు చేసిన విషయ్యం ముందు ఇది గొప్ప విషయమే కదా !

ఆవిడకి జ్ఞానోదయం చేసిన కుక్క అరుపు హృదయవిదారకంగా వినబడుతూనే ఉంది. 'మానవుడు వృద్ధ జంతువులపట్ల చూపుతున్న అమానుషత్వాన్ని తెలియజేస్తూ వృద్ధ జంతువులకంటె మీరు నయంకాదా అని ప్రశ్నిస్తోంది తనకి తెలిసిన భాషలో తనకి తెలిసిన రీతిలో !'

అది వింటూ అచేతనంగా కూర్చుండిపోయింది కాంతమ్మ.




